# దొడ్డ మనసు

సుజాత మనసు మనసులోలేదు. మంచంమీద వెల్లకిలా పడుకొని పైన తిరుగుతూన్న సీలింగ్ ఫేన్వైపు చూస్తూ ఆలోచిస్తోంది. సుజాత పెద్దన్నయ్య విశాఖపట్నంలో స్టేట్ బ్యాంక్లో ఆఫీసర్. ఎనభైవేలు పెట్టి యిల్లు కట్టాడు. గృహప్రవేశానికి రమ్మని ఉత్తరం రాసాడు.

వెళ్లాలని ఉబలాటపడింది సుజాత. "నాకు శలవులేదు! వెళ్లాలనుంటే నీవెళ్లు!" అన్నాడు భర్త శంకరం.

"గృహప్రవేశంనాడు ఆడబడచు కళకళ్లాడ్తూ యింట్లో తిరగాలి! తప్పకుండా రమ్మని ఒదిన కూడా రాసిందండి! వెళ్లకపోతే బావుండదు!" పట్టుబట్టింది సుజాత.

నాకు కుదరదు! నువ్వూ పిల్లలూ వెళ్లండి!" అని భర్త అనడంతో చీకాకేసింది సుజాతకి.

"ఇద్దర్నీ రమ్మని రాసారు! నే ఒక్కర్తినే వెళ్లను! రావడాన్కి కుదరదని ఉత్తరం రాస్తాను!" అంది. శంకరం మాట్లాడలేదు. భర్త మీది కోపంకొద్దీ అలాగే ఉత్తరం రాసింది.

మర్నాడు గృహప్రవేశం ముందురోజున శంకరానికి బావమరదినుంచి టెలిగ్రాం వచ్చింది. "స్వయంగా వచ్చి పిలవనందుకు అపార్థం చేసుకోకండి! దయచేసి అంతా వెంటనే రండి!" మరోసారి ఆహ్వానం పంపాడు పెద్ద బావమరది. తాము వెళ్ళకపోతే వారు అపార్థం చేస్తుకొంటారేమో! ఆలోచించాడు శంకరం. వెళ్లడానికే నిశ్చయించుకొన్నాడు. ఆఫీసుకి రెండు రోజులు శలవు పెట్టి బయలుదేరాడు. పెళ్లాంపిల్లల్తో శంకరం వెళ్లినందుకు అంతా సంతోషించారు.

"దూరంగా భిలాయ్లోవున్న మీ అక్కా బావ ఎలాగూ రాలేరు! దగ్గరగా

రాజమండ్రిలో వుండి కూడా రాకపోతే ఎలాగే ? వచ్చారు కాబట్టి యిల్లు కళకళ్లాడ్తోంది!" వారిరాకతో సంతోషించింది సుజాత తల్లి.

"ఎంతమంది వచ్చినా ఆడపిల్లలు వస్తేగాని యింటికి శోభ వుండదు! ఆడబడుచువనిపించుకొన్నావ్ ! అన్నయ్య మరోసారి పిలిస్తేగాని రాలేదు!" వచ్చినందుకు సంతోషిస్తూ వేళాకోళాం చేసింది సుజాత వదిన, వనజ. ఆ శుభకార్యానికి వనజ పుట్టింటివారు అంటే యిద్దరన్నయ్యలూ వదినలూ చెల్లెలూ కూడా వచ్చారు. సుజాత చిన్నన్నయ, వదిన కూడా వచ్చారు. గృహప్రవేశం మంచి వేడుకగా జరిగింది. చాలా డబ్బు ఖర్చుపెట్టి ఆఫీసు వాళ్లకి పార్టీ యిచ్చాడు.

శలవు లేదంటూ ఆ రోజు సాయంత్రమే వెళ్లిపోయారు సుజాత చిన్నన్నయ్యా ఒదినలు. మర్నాడుదయం మిగతావారు ప్రయాణం కట్టారు. ఒదినలకీ, చెల్లెలకీ బొట్టుపెట్టి జాకెట్ ముక్కలు అందించింది వనజ. మధ్యాహ్నం భోజనాల దగ్గర చెప్పింది ఒదినతో సుజాత, తాము కూడా ఆ మర్నాడుదయం వెళ్లబోతున్నామని. మరో రెండు రోజు లుండమన్నాడు పెద్దన్నయ్య. శలవు లేదన్నాడు శంకరం.

ఆ రోజు సాయంత్రం సుజాత అన్నయ్య బజారుకెళ్తూ శంకరాన్ని కూడా రమ్మనడం వింది. తమకి బట్టలు తీయడానికి భర్తను బజారుకి ప్రయాణం చేస్తున్నాడని ఊహించింది సుజాత. తన చీరను తానే సెలక్టు చేసుకుంటే బావుంటుంది. తానుకూడా వెళ్లాలనుకొంది. ఒక్కర్తీ వెళితే బావుండదు. అందుకని ఒదినని కూడా ప్రయాణం చేయాలనుకొంది. "మనం కూడా వాళ్లతో బజారుకెళ్దామా ఒదినా ?" అడిగింది.

"నాకు బోలెడు పనులున్నాయమ్మా! తెచ్చిన సామాన్లు అందరికీ తిరిగి పంపించాలి ! ఇల్లు సర్దుకోవాలి! వెళ్లాలంటే నీవెళ్లు! అయినా వాళ్లెక్కడెక్కడ తిరుగుతారో! ఎప్పుడు తిరిగి వస్తారో!" నిరుత్సాహపర్చింది వనజ. పిలవని పేరంటంలా అన్నయ్యతోనూ భర్తతోనూ వెళ్లడానికి అభిమానం అడ్డొచ్చింది సుజాతకి.

రాత్రి ఎనిమిది గంటలకి బావమరదులిద్దరూ ఒట్టి చేతుల్తో తిరిగి రావడం చూసి తెల్లబోయింది సుజాత. ఇదివరకే అన్ని సామాన్లుతోనూ తమకి కూడా బట్టలు కొనేసి వుంటారు అనుకొంది. చాటుగా తల్లిని పిలిచి అడిగింది తమ బట్టల విషయం. "ఏమోనమ్మా నాకు తెలీదు ! అంతా మీ ఒదిన పెత్తనం!" మీకు బట్టలు తీసినట్లు

కనిపించలేదు చెప్పింది తల్లి.

మర్నాడుదయం ప్రయాణం అవుతూంటే, పళ్లెంలో పసుపూ కుంకుమా జాకెట్టు ముక్కా పెట్టి, ఆడబడుచుకు బొట్టుపెట్టి అందించింది వనజ. నిర్ఘాంతపోయింది సుజాత.

మౌనంగా అందుకొంది. అసంతృప్తిగా అన్యమనస్కంగా పుట్టింటి మెట్లు దిగింది. అంతా గమనించాడు శంకరం.

"ఎనభైవేలు పెట్టి యిల్లు కట్టించాడు. వచ్చిన ఒక్క ఆడపిల్లకీ చీరయినాకొని యివ్వలేకపోయాడు." ఉండబట్టలేక ట్రైన్‌లో భర్తతో అంది సుజాత. భార్య బేలతనానికి చిరునవ్వు నవ్వాడు శంకరం.

"ఆశపెట్టు కొన్నవాళ్లకి నిరాశ ఎదురయ్యే ప్రమాదం ఉంటుంది సుజాత! ఆశలేకపోతే నిరాశకలిగే అవకాశం ఉండదు! అయినా నీకేమి లోటని? గాడ్రెజ్ బీరువా నిండా నీ చీరలే! ఒకరు పెట్టలేదని ఎప్పుడూ అనుకోకూడద.!" అనునయించబోయాడు.

భర్త నిశ్చింతగా నిదానంగా అంటూంటే సరిపెట్టుకొని సమాధాన పడలేకపోయింది సుజాత.

"ఆడపిల్లకి ఆశ పుట్టింటిమీద కాకపోతే ఎవరిమీది వుంటుందండీ? ఆ వచ్చిన వాళ్లందరి తోనూ నేను కూడా సమానమా? టెలిగ్రాం యిచ్చి మరీ రప్పించుకొన్నారు.... అక్క ఎలాగూ రాలేదు! వచ్చిన ఒక్క ఆడపిల్లనీ అందరితోనూ సమానంచేసి అవమానంచేసి పంపింది ఒదిన! పెళ్లయిన ఆరేళ్లలోనూ యిది మూడోసారి వాళ్లింటికి వెళ్లడం! రెండువేలు రూపాయలు జీతగాడు ! ఒక్కసారైనా చీర పెట్టనిచ్చిందా ఒదిన! తన చెల్లెలుకి క్రిందటినెల్లో నూటయాభై పెట్టి చీరకొందిట!"

ఆవేశంలో తాము ట్రైనులో అందరిమధ్యా వున్నామన్న సంగతే మర్చిపోయింది – కంటతడి పెట్టుకొంది.

"మీ ఒదిననెందుకూ అనుకోవడం ? మీ అన్నయ్యకొంటానంటే వద్దంటుందా? అతనికే వుండాలి అభిమానం!"

"మా ఒదిన సంగతి మీకు తెలీదండి! తన చెల్లెలికి చీర కొనిపించింది

కదా! శుభకార్యం చేసుకొన్నారు! నాకు కూడా కొనిపించాలన్న జ్ఞానం వుండద్దూ? నాన్నగారే వుంటే యిలా చేయనిస్తారా? అమ్మ మాటకి విలువలేదు!"

సుజాతకి ఒదినమీదనున్న అభిప్రాయాన్ని మార్చడం కష్టమనిపించింది శంకరానికి.

"ఆ విషయం మర్చిపో!" అన్నాడు తేలిగ్గా.

"ఎలా మర్చిపోగలనండీ ? వందరూపాయలు ఖర్చుపెట్టుకొని వెళ్లాం! ఈ జాకెట్టు ముక్క కోసమా ? ఆర్రూపాయలు ఖరీదు చేయదు. నాకక్కర్లేదు. పనిమనిషికిచ్చేస్తా!" అంది వుక్రోషంగా, మాట్లాడ్తూంటే మరీ రెచ్చి పోతుందని మౌనం వహించాడు శంకరం.

రాజమండ్రి చేరేసరికి పదిగంటలైంది. తిన్నగా ఆఫీసుకుపోయి ప్యూన్‌చేత రెండు కారియర్ మీల్సు యింటికి పంపాడు. పిల్లలిద్దర్కీ అన్నం పెట్టింది సుజాత. అన్నం తిని పక్కింటికి పోయారు పిల్లలు ఆడుకోడానికి. తనకి అన్నం తినాలనిపించలేదు. వెల్లకిలా మంచంమీద పడుకొని ఆలోచిస్తోంది. సుజాత మనసు మనసులోలేదు.

❖ ❖ ❖ ❖ ❖

వీధి తలుపులు వారగావేసి వుండంతో గదిలో ప్రవేశించింది పనిమనిషి గౌరి. చిందర వందరగా పడివున్న కారియర్ గిన్నెల్నీ, అన్యమనస్కంగా మంచంమీద పడుకొని తన రాకను గమనించని సుజాతనూ చూసి అడిగింది.

"ఎప్పుడొచ్చారమ్మగారూ? ఇంకా భోజనం చేయలేదా ?" చివాల్న లేచి కూర్చుంది సుజాత.

"ఆకలిగాలేదు గౌరి! ఆ అన్నం తీసుకుపో!" అంది.

"పుట్టింటోరు అంతెక్కువగా పెట్టారేటమ్మగోరూ!".

చీకాగ్గా గౌరి వంక చూసింది సుజాత. కానీ ఆమె నవ్వు మొహం చూసాక ఆ చికాకంతా మాయమైంది. నార్మల్ అయిపోయింది.

గౌరి నవ్వితే నవరత్నాలూ రాల్తాయ్. ఆమె బుగ్గలు సొట్టలు పడ్తాయ్. దానిమ్మ గింజల్లాంటి పలువరస! సంపెగ మొగ్గను పోలిన ముక్కు! చక్రాల్లాంటి

కళ్లు! పొడుగాటి జడ! ఆపైన కలుపుగోరుతనం! చలాకీతనం! వయసు యిరవై దాటవ్! అందర్నీ యిట్టే అకట్టుకొంటుంది. కపటం ఎరుగని మనిషి. గౌరి మొగుడు స్వామి టాకీస్ దగ్గర చిన్న పాన్‌షాప్ వుంది. పెట్టుబడి ఎక్కువగా లేనందువల్ల పెద్దగా బేరం వుండదు. ఇల్లు గడవడం కష్టం. అందుకే గౌరి మూడిళ్లల్లో పనిచేసి యాభై రూపాయలు సంపాదిస్తుంది నెలకి. మంచి చీర కట్టుకుని గౌరి ముస్తాబైతే చూడ్డానికి వేయి కళ్లు చాలవ్. కానీ గౌరి ఎప్పుడూ ముతక చీరలే కడుతుంది. ఇంజనీరు గారి భార్య ట్రాన్స్ఫర్ మీద గుంటూరు వెళ్తూ గౌరికి ఒక వులివులీ చీర యిచ్చింది. దాన్ని పదిలంగ దాచుకొంది. పండుగనాడు మాత్రమే కడుతుంది.

రెండు నెల్ల క్రితం సుజాత భర్త శంకరం పదిహేను రోజులు ట్రైనింగ్ కోసం హైదరాబాదు వెళ్లాడు. పిల్లల్ని తీసుకొని అన్నయ్య దగ్గరకి విశాఖపట్నం వెళ్లమన్నాడు భర్త. సుజాత వెళ్లడానికి కిష్టపడలేదు. భర్త వెళ్లిన నాలుగో రోజున ఉన్నట్టుండి పెద్ద జ్వరం వచ్చింది సుజాతకి. గౌరి వెళ్లి డాక్టర్ని తీసుకొచ్చింది. నాలుగు రోజులు సుజాత మంచం దిగలేదు. భయం వేసింది సుజాతకి. భర్తకి టెలిగ్రాం పంపాలనుకొంది. కానీ ప్రమోషన్ కి ఆ ట్రెనింగ్ చాలా అవసరం. రాకరాక వచ్చిన ఆ అవకాశాన్ని పోగొట్టుకోవడం యిష్టంలేదు. పైగా డాక్టరుగారు ధైర్యం చెప్పారు ఐదు రోజులు జ్వరం కాసి తగ్గిపోతుంది. ఆ పైన గౌరి సపర్యలు ! భర్త వచ్చి మాత్రం అంత కన్నా ఏం చేయగలడు! ధైర్యం తెచ్చుకొంది సుజాత. డాక్టరుగారు అన్నట్టుగానే ఆ రోజు నుంచి జ్వరం తగ్గుముఖం పట్టింది. క్రమేపీ తగ్గింది. ఆ ఆరురోజులూ గౌరి సుజాతను వదల్లేదు. టైం ప్రకారం మందులు యిచ్చేది, పళ్లరసం, గ్లూకోజూ, బార్లీ వగైరాలు యిచ్చేది. ఎన్నో ఇతర సేవల చేసింది. పక్కింటి యిల్లాలు పిల్లలకు అన్నంవండి పెట్టింది. గౌరిని కూడ అక్కడే తినమనేది సుజాత. "ఎందుకమ్మగారు! మా అత్త అన్నం వండి వుంచుతాది. నాలుగు మెతుకులు తినేసి క్షణంలో వచ్చేస్తాను!" అంటూ యింటికిపోయి అన్నం తిని పావుగంటలో తిరిగి వచ్చేది- మొగుడ్ని ఇద్దరు పిల్లల్నీ వదిలేసి ఆ వారం రోజులు సుజాత యింట్లోనే వుండిపోయింది.

గౌరి మీద ప్రత్యేక అభిమానం ఏర్పడింది సుజాతకి. గౌరికి అభిమానం ఎక్కువ. ఎంత యిబ్బందిలోవున్నా నోరు కదిపి ఏమీ అడగదు...

ఆమె అడగకపోయినా ఏదో ఒకటి ముట్టజెబుతుంది సుజాత.

"నేనంటే ఎందుకే యింత అభిమానం ?" ఓనాడు అడిగింది సుజాత.

"ఏమోనమ్మా చెప్పలేను! తక్కినిళ్లలో పనిచేస్తున్నానా ! పనవగానే ఒక్క క్షణం వుండబుద్ధిగాదు! తవరింట్లో పనైన వెళ్లబుద్ధేయదు!" అంది.

ఏవిటో అనుబంధం! అనుకొంది సుజాత. ఏదో సందర్భంలో తన పుట్టినరోజు కొత్తమావాస్య వెళ్లిన పంచమినాడు అని చెప్పింది గౌరి.

ట్రైనింగ్ పూర్తి చేసుకొని వచ్చాడు శంకరం. తన జబ్బు గురించీ గౌరి చేసిన సేవలు గురించీ చెప్పింది సుజాత.

"ప్రేమాభిమానాన్ని డబ్బుతో కొనుక్కోలేం సుజాతా! ఒక్కొక్కరు కల్సుకొన్న వేళావిశేషం అలాంటిది."

"కొత్త మావాస్య వెళ్లిన పంచమినాడు దాని పుట్టిన రోజు ! క్రిందటి నెలలో మీరు కొన్న ఆ పాలిస్టర్ చీరని దానికిద్దామనుకొంటున్నా!" తన నిశ్చయాన్ని తెలియజేస్తూ అనుమతి కోసం భర్త కళ్లలోకి చూసింది.

"నూటపాతిక పెట్టి కొన్నావ్!" ఒక్కసారే కట్టావ్!" ఆశ్చర్యంగా అన్నాడు శంకరం.

"నూటపాతికే కదా! గౌరి లేకపోతే మీరు తిరిగి వచ్చేసరికి నేను కన్పించి వుండేదాన్నే కాదు! ఆ లేత నీలివర్ణం చీరలో గౌరిని చూడాలని వుందండీ!" ముచ్చటపడింది సుజాత.

"అయితే రేపే యిచ్చేయ్!" అన్నాడు శంకరం.

"రేపా ? యిప్పుడే ఎందుకు ? ఇంకా రెండు నెలలు టైముంది!" ఆశ్చర్యపోయింది సుజాత.

"ఒక మంచి పనినిగానీ,ఉపకారంగానీ చేయాలనిపించినప్పుడు వెంటనే చేసెయ్యాలి! వాయిదా వేయకూడదు! ఎవరికైన హానిగాని అపకారంగానీ చేయాల్సివచ్చినప్పుడు మాత్రం తొందరపడకూడదు! నిదానంగా ఆలోచించాలి తెలుసా?"

"అవును! నిజమే!" అనుకొంది సుజాత.

❖ ❖ ❖ ❖ ❖

మర్నాడు సుజాత చాపమీద కూర్చొని జడ అల్లుకొంటూంటే ఎదురుగా గచ్చుమీద కూర్చొని చూస్తోంది గౌరి.

"పనయిపోయిందా?" అడిగింది సుజాత జడ అల్లుకోవడం ముగించి లేస్తూ. గౌరి కూడా లేచి నిలబడింది.

"అయిపోయింది చాలా సేపయిందమ్మగారు! నేనొస్తా!" కదలబోయింది గౌరి.

"ఒక్క నిమిషం అగవే!" అంటూ గదిలోకి వెళ్లి మరుక్షణంలో తిరిగి వచ్చింది సుజాత. ఆమె చేతిలో పాలిస్టర్ చీర వున్న ప్లాస్టిక్ కవరుంది.

"పేరంటం ఏదైనావుందా అమ్మగోరూ!" అడిగింది గౌరి.

"లేదు! నీకే! తీసుకో! నీ పుట్టినరోజు వస్తోంది కదా! కవరు అందివ్వబోయింది సుజాత. చేయి చాపలేదు గౌరి! ఆ చీరవైపే చూస్తూ వుండిపోయింది. సంభ్రమాశ్చర్యాల్లో మునిగిపోయింది. అంత ఖరిదైన చీరని తానెప్పుడూ చేతితోనైన తాకలేదు! "నూట పాతిక పెట్టి నెలరోజుల క్రితం కొనుక్కొన్నారు! ఒక్కసారే కట్టారు! మడత కూడ నలగలేదు! సరికొత్త చీర! తనకే?" నమ్మలేకపోయింది గౌరి.

"తీసుకోవే!" చేయి చాచింది సుజాత. "అమ్మగారూ!" అంది ఆనందావర్ణవంలో మునిగిన గౌరి వుక్కిరిబిక్కిరవుతూ.

"నీ పుట్టినరోజునాడు కట్టుకొని నీ మొగుడుతో మా యింటికిరా!" అందించింది సుజాత.

మీది మహా "దొడ్డమనసమ్మగారు"! చీరని అందుకొంటూ ఆమె కళ్లలోకి చూసింది కృతజ్ఞత వ్యక్తం చేస్తూ.

"దొడ్డమనసంటే ఏవిఁటే?" అడిగింది సుజాత ముసిముసిగా నవ్వుతూ.

"పెద్దోరికి అంటే డబ్బునోరికి జాతి గుణం ఉంటదమ్మగోరూ! ఆళ్లకే

దానగుణం కూడా వుంటాది. తమని నమ్ముకొన్నోళ్లనీ, ఆస్రించినోళ్లనీ ఆదుకొంటారు! ఆదరంగా సూత్తారు!" అంతకన్నా విడమర్చి చెప్పలేకపోయింది గౌరి. ఆ నిర్వచనానికి నవ్వుకొంది సుజాత.

ఉదయం తొమ్మిది గంటలైంది. భర్తని భోజనానికి పిలవడాన్కి వీధి గదిలోకి వెళ్లింది సుజాత. వీధి గుమ్మంలో రిక్షా ఆగింది. ఆడబడచు సరస్వతీ, ఆమె భర్త మూర్తీ రిక్షా దిగుతున్నారు. పెట్టే బెడ్డింగూ వగైరాలున్నాయ్. సుజాత, శంకరం యిద్దరూ ఎదురుగా వెళ్లి లోనికి తీసుకొచ్చారు సాదరంగా. పలక రింపులూ కుశలప్రశ్నలూ అయాయ్. ఆఫీసుకి శెలవు పెట్టి వస్తానని బయలుదేరాడు శంకరం. బావగారితో మూర్తి కూడా వెళ్లాడు ఆఫీసుకి. తాము తెచ్చిన బిస్కట్లు, స్వీట్సు పిల్లకిచ్చింది సరస్వతి. వద్దని వారిస్తున్నా వంటలో సాయానికి దిగింది సరస్వతి. వంటగదిలో చాలా విషయాలు చెప్పింది సరస్వతి. సరస్వతికి కలకత్తాలో వుద్యోగం. లీవ్ ట్రావెల్ కన్సెషన్ మీద రామేశ్వరం వరకూ వెళ్లి తిరిగివస్తున్నారుట తాము చూసిన విహారస్థలాల గురించీ, సందర్శించిన దేవుళ్ల గురించీ, ప్రయాణాల్లో పడే యిబ్బందులూ, రిజర్వేషన్ కోసం పడే పాట్లు ఎన్నో చెప్పింది. తిరుగుప్రయాణంలో అన్నయ్యనీ వదిన్నీ చూసిపోదామని దిగారుట. మర్నాడుదయం బయలుదేరి అత్తవారింటికి అనకాపల్లి వెళ్లి అక్కడ రెండు రోజులుండి మూడోనాడు బయలుదేరి కలకత్తా పోతారట. అదీ వారి టూర్ ప్రోగ్రాం. సరస్వతి వద్దంటున్నా పప్పు, రెండు కూరలు, పులుసూ తయారుచేసింది సుజాత.

పదకొండు గంటలకల్లా బావమరదులిద్దరూ తిరిగివచ్చారు. అంతా ఒకేసారి భోజనాలకి కూర్చున్నారు. చలోక్తులతోనూ కులాసా కబుర్లతోనూ భోజనాలు ముగిసాయ్. అత్తయ్య కొంగు పట్టుకొని తిరిగారు పిల్లలు. మధ్యాహ్నం రెండుగంటలైంది. సరస్వతీ, మూర్తీ యిద్దరూ ప్రయాణపు బడలికవల్ల గాఢనిద్రలో మునిగి పోయారు. సుజాత భర్తను బజారు వెళ్లి స్వీట్ కొని తీసుకొని రమ్మంది. తాను పకోడిలు తయారుచేస్తానంది, మధ్యాహ్నం పలహారానికి, తన మనసులోని మాట బయటకు చెప్పాలని...

"సుజాత!" అన్నాడు శంకరం. "ఏమిటి? చెప్పండి" అడిగింది సుజాత.

"రేపు ఉదయమే వెళ్లిపోతారటా!"

"అవునట! సరస్వతి చెప్పింది! ఉండమంటే శెలవు అయిపోయిందటోంది!"

"సాయంత్రం అందరూ కల్సి బజారు కెళ్దాం! పెందరాళే రాత్రి వంటకూడా కానిచ్చేయ్!" అన్నాడు.

"ఎందుకూ? ఉన్న ఒక్కపూటా బజార్లమ్మట తిరగడం ? ఇంట్లోనే సరదాగా కబుర్లు చెప్పుకొందాం! చాలా కాలానికి వచ్చారు!" అంది.

"అదే! చాలా కాలానికి వచ్చారు! అందుకే వాళ్ళకి బట్టలు కొనిపెడితే బావుంటుందనీ..." నసుగుతూ అన్నాడు. సుజాత మాట్లాడలేదు.ఆమె మొహంలో అసమ్మతి కన్పించింది. చికాకు వేసింది శంకరానికి.

"ఏవిటాలోచిస్తున్నావ్? ఆడపిల్ల కదా ? పెళ్లయిన మూడేళ్ల తర్వాత వచ్చింది! దానికీ ఏవో ఆశలుంటాయ్!" అన్నాడు.

"ఇవేమీ పూర్వపురోజులుకాదు!! ఆడపిల్ల వచ్చినప్పుడల్లా చీరెలూ సారెలూ పెట్టడానికి! ఆమె పెళ్లికి అయిదువేలు మీరు సర్దుబాటు చేసారు ! ఆ అప్పు ఇంకా వెయ్యి రూపాయలుంది! రేపు పురుడికీ పుణ్యానికి మరికొంత ఖర్చు! ఆమె బహుశా యిక్కడికే రావచ్చు! మీ చెల్లెలుకి అయిదో నెలట! తెలుసా?"

"అవును! వట్టిమనిషికాదు కాబట్టే అంటున్నా! రాక రాక వచ్చిందని!" తన పట్టు విడువలేదు శంకరం.

"రెండు వేల రూపాయలు జీతగాడు! ఎనభై వేలు పెట్టి యిల్లు కట్టినప్పుడే గృహప్రవేశానికి ఆడపిల్లకి ఏమీ పెట్టలేకపోయాడు! మనం లెక్కా! మీకూ పిల్లలెదుగుతున్నారు. లేనిపోని అభిమానాలుపడి అప్పులుపాలు కాకండి!" భర్తను మందలించింది సుజాత. మారుమాటాడలేకపోయాడు శంకరం. స్వీట్సు కోసం బజారుకి బయలుదేరాడు.

తెల్లవారుఝామున మూడు గంటలకీ లేచి వేడినీళ్లు పెట్టింది. కాఫీ టిఫెన్లు తయారు చేసింది. అయిదున్నర అయేసరికి రిక్షా తీసుకొచ్చాడు మూర్తి. ఆడపడుచుకి

బొట్టుపెట్టి, పసుపూ, కుంకుమ, జాకెట్టు ముక్కా వుంచిన పళ్లేన్ని అందించింది సుజాత. ఆ జాకెట్టు పీసువైపు పరీక్షగా చూసాడు శంకరం. అది సుజాతకి వాళ్ల ఒదిన గృహప్రవేశానికి యిచ్చిన జాకెట్టు పీసే! సరస్వతి

సంబరపడుతూ అందుకొంది. అన్నయ్యా వదినల పాదాలకి నమస్కరించింది. చెల్లెలు పాదాలకున్న పసుపూ నుదుట కుంకుమ బొట్టూ చూస్తూ "మేమేమీ యివ్వలేకపోయినా కలకాలం నీవిలాగే కనబడాలి తల్లీ!" అనుకొన్నాడు శంకరం. అతని కళ్లు చెమర్చాయ్.

❖ ❖ ❖ ❖ ❖

ఆ రోజు గౌరి పనిలోకి రాలేదు. ఆవేళ దాని పుట్టినరోజు. సాయంత్రం ఆరుగంటలయింది. రాత్రికి వంట ప్రయత్నంలో పడింది సుజాత. వీధిలో గౌరి కేక విన్పించింది. తలుపు తీసింది సుజాత. ఎదురుగా గౌరి ! దాని మొగుడు! ఇంజనీరుగారి భార్య యిచ్చిన ఆ లేతనీలి ఆకుపచ్చ వులివురీ చీర కట్టుకొంది గౌరి. అదే రంగు గాజులూ, జాకెట్టూ, బొట్టూ! చేతి గోళ్లకి నైల్‌పాలిష్! వాలుజడ. జడలో బంతిపువ్వు! "గౌరి కూడా అందమైన పిల్లే!" అప్రయత్నంగా అనుకొంది. తెల్లటి ఫాంటూ, స్లాకూ వేసుకొన్నాడు. పాతవే అయినా బావున్నాయ్! 'ఈడైనవాడే!' అనుకొంది.

ఇంట్లోకి రమ్మని కాఫీ యిచ్చింది యిద్దరికీ! "ఎందుకమ్మగోరూ మాకు కాఫీలు? మా మావ సినిమా కెళ్దాం అన్నాడు, అందుకు బయలుదేరాం!" అంది కాఫీ అందుకొంటూ.

ఒక రూపాయి గౌరి చేతిలో పెడ్తూ "మల్లెమొగ్గలు కొనుక్కో!" అంది సుజాత. ఆ రూపాయి అందుకొంటూ "మా అమ్మగారిది మా దొడ్డమనసు" అంది భర్తతో. వాళ్లు వెళ్తుంటే గౌరివైపే చూస్తూ వుండిపోయింది సుజాత.

ఆమె ఆలోచన వేరు! తానిచ్చిన ఆ కొత్త చీరని గౌరి ఎందుకు కట్టుకోలేదు! ఆ చీర ఏమైంది? ఎవరికైనా అమ్మేసిందా ? లేక తాగడానికి డబ్బులేక మొగుడు అమ్మేసాడా? ఆ క్లాసు మనుషుల్లో ఎక్కువమందికి తాగుడలవాటుంటుంది. తమ గుడిసెల్లోని మగాళ్లు ఎక్కువమంది రాత్రిళ్లు తాగొచ్చి గొడవలు చేస్తారని ఇదివరలో గౌరి అంది. అయితే తన మొగుడికి అలాంటి అలవాటు లేదని చెప్పుకొంది. అది ఒట్టి అబద్ధం. తాను చులకనైపోతానని అలా చెప్పుకొనివుంటుంది! అపాత్రదానం చేయడం తనదే పొరపాటు!" అనుకొంది. గౌరి మీద అంతులేని ఆగ్రహం వచ్చింది.

మర్నాడు గౌరి పనిలోకి రాగానే అడిగింది. "ఏవే! నేనిచ్చిన చీర కట్టుకోలేదు?"

"అదా ? లేదమ్మగోరూ!" తడబడింది గౌరి.

"లేదా? ఏమైంది?" సుజాత ఆగ్రహం అంచులు దాటింది.

"నా దగ్గర లేదమ్మగారూ!" తప్పు చేసినదానిలా నేల చూపులు చూసింది.

"తాగడానికి డబ్బుల్లేక నీ మొగుడు అమ్మేసాడా?"

చివాల్న తలెత్తింది గౌరి. "లేదమ్మగోరూ! నా మొగుడు కలాంటి అలవాటు లేదు!" విలవిల్లాడింది.

"మరేమైందే? ఎగిరిపోయిందా ? ఎవరైనా ఎత్తుకుపోయారా ?"

నెమ్మదిగా చెప్పసాగింది గౌరి. "వారం రోజుల క్రితం మా ఆడబడుసొచ్చిందని చెప్పానుగదమ్మగోరూ! పెళ్లయిన పదేళ్లకి పుట్టింటి గడప తొక్కింది. ఆళ్లు అయిదరాబాదులో వుంటున్నారు. రైలు కరుసులు దండగని ఎప్పుడోగాని రాదు! ఆడపడుసు పెళ్లికని సికాకోళం వెళ్లి తిరుగు పెయానంలో మా యింటికొచ్చారు. మేం పిలవకపోయినా రాకరాక వచ్చింది. పైగా వట్టి మడిసి కూడా కాదు! పెళ్లయిన పదేళ్లకి గర్భం వచ్చింది! నాలుగోనెలంట ! మా మావ నాలుగురూపాయిలు పెట్టి రయికల గుడ్డ తెచ్చాడు. పసుపూ కుంకుమతో బాటు తవరిచ్చిన చీరని కూడా మా ఆడబొడుసు కిచ్చేనమ్మగోరూ! నన్ను చమించండి!" క్షమాపణ అర్థించింది.

అవాక్కయింది సుజాత. ఆశ్చర్యంగా గౌరి ముఖంలోనికి చూస్తూ వుండిపోయింది. అమ్మగారి ముఖ కవళికల్లో మార్పు రావడం చూశాక ధైర్యం వచ్చింది గౌరికి. స్వరం పెంచింది.

" ఆ చీరని చూసి ఎంతో మురిసిపోయిందా ఆడబొట్టి ! ఆమె సంబరం చూస్తుంటే నా కెంతో ఆనందం వేసిందమ్మగోరూ, తవరు నమ్మరుగాని ఆ చీరని నేను కట్టుకొన్నా నాకంత ఆనందంగా వుండదు!"

సుజాత కళ్లనుండి ఆనందాశ్రువులు రాలాయ్! గౌరి మనసెంత ఉదాత్తమైంది? మౌనంగా వుండిపోయింది.

"ఆడపిల్ల ఆనందంగా మన గడప దాటితేనే ఆ బగవంతుడు మనకింత కలుగజేస్తాడమ్మగోరూ! ఓ రూపాయి డబ్బులు చేతిలో పెడితే మనకి లచ్చ రూపాయలు కలగాలని కోరుకొంటాది. పుట్టిల్లు ఎప్పుడూ పచ్చగా వుండాలని కోరుకొనేది ఆడపిల్లే కదమ్మగోరూ!"

సుజాతన తన కళ్లలోకి సూటిగా, ప్రసన్నంగా చూస్తూంటే అర్థంకాక ఆగిపోయింది గౌరి!

"క్షమించడమ్మగోరూ! పొరబాటైంది! ఈసారెప్పుడూ అలా చేయను!" అంది ముగింపుగా.

సుజాతకి అంతస్థు అడ్డొచ్చింది. లేకపోతే గౌరిని అమాంతం కావలించుకొని అభినందించి వుండేది.

"లేదు గౌరి ! నీది పొరపాటు కానేకాదు! డబ్బున్న వాళ్లకే దొడ్డమనసుంటుందన్నావే ఆవేళ! ఆ నీ అభిప్రాయమే పొరపాటు! నీదే దొడ్డమనసు!"

మరోసారి గౌరిని అభినందించింది సుజాత.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక
(దీపావళి కథల పోటీలో బహుమతిపొందిన కథ)
తేది 11-11-1983